కథానిక

# సంతలో పెళ్ళికొడుకులు

"మూర్తి"

"ఆకెళ్ళారబ్బాయి వున్నాడు... చూశారూ—కుర్రాడు మాంచి చురుకైనవాడు... బి.ఏ. ప్యాసయ్యాడు... వాడి వాటా మట్టుకి పదెకరాల మాగాణీ వస్తుంది. ఘట్టికాసైన సంబంధం..."—ఆ కంఠస్వరం... బరువుగా, సాగదీస్తూ, మాటకీ మాటకీ మధ్య ఆగుతూ, ఆగినప్పుడల్లా శ్రోతల మొహాల్లోకి 'ఏమంటారు?' అన్నట్లు నిశితంగా చూస్తూ, ఏదో గొప్ప అంతర్జాతీయ రహస్యాన్ని ఇట్టే చెప్తున్నట్లు ఎంతో ప్రాముఖ్యం కనపరుస్తూ, ఏ విషయమేనా తనకిట్టే అకళింపుఅనే స్వాతిశయంతో మాట్లాడే ఆ ధ్వని, ఎక్కడో విన్నట్లుంది. "ఎవరా" అంటూ అప్పుడే శంకరయ్య కాఫీ హోటల్లోకి అడుగెడుతూన్న నేను గిరుక్కున అటుకేసి బుర్రతిప్పేను. శంకరయ్య గల్లాశరీరానికీ, బిల్లు చెల్లించే ఆసామీ ముఖానికీ మధ్య సందులోంచి ఆ మాట్లాడే వ్యక్తి తలమాత్రం కనిపించింది. దోసకాయలాంటి నిలువు మొహం, నెత్తిపైన ఆరంగుళం ఎత్తున నిక్కబొడుచుకున్న వెంట్రుకలు, చిన్నని, లోతైన. చక్రాల్లాంటి కళ్ళు,—ఇంకెవరు శివయ్యే! శివయ్య సాధారణంగా ఉన్నచోట మళ్ళా ఉండడు. కనిపించినచోట మళ్ళా కనిపించడు. రైలుపెట్టెలో, కాఫీ హోటల్లో, సత్రం అరుగుమీద, తువరశాలలో, ఎక్కడో ఓ చోట కనిపిస్తూనే ఉంటాడు. మాటల్తో మనుష్యుల్ని బోల్తా కొట్టించి ఉదయం కాఫీ టిఫిన్లు లగాయితు రాత్రి రెండో ఆట సినీమావరకూ తన అవసరాల్ని తీర్చుకోవడం అతని సహజ వృత్తి. నా చూపులు అతన్ని గ్రుచ్చుకున్నాయి కాబోలు, తనుకూడా చటుక్కున నాకేసి చూసేడు. అంతవరకూ సీరియస్‌గా మాట్లాడుతున్న అతని మొహంలో చిరునవ్వు అలంకరించింది. ఎంతో ఆప్యాయత ఉట్టిపడేటట్లు "ఏమోయ్! రామారావ్!" అని పెద్ద కేక వేసి "ఎన్నాళ్ళకి, ఎన్నాళ్ళకి" అంటూ, దగ్గరకు వచ్చి నన్ను తీసుకెళ్ళేడు తను కూర్చున్న చోటికి. అవతల బల్లచుట్టూవున్న కుర్చీల్లో ఒకదాన్ని తన కుర్చీ ప్రక్కగి లాగి "కూర్చోవోయ్" అన్నాడు హోటలంతా తన సొంతమైనట్లు. శివయ్యకు క్రొత్తనేది లేదు. ఏ స్థలమైనా తన స్వంత యింటిలాగ, ఏ మనిషైనా తన బాల్య స్నేహితుడిలాగ, చూసుకోటం శివయ్యకి అలవాటు. అతని అద్వైత భావానికి మనస్సులోనే జోహారు అర్పించాను.

శివయ్య కూర్చున్న బల్లదగ్గర యింకా యిద్దరు పెద్ద మనుష్యులు కూర్చున్నారు. అందులో ఒకాయన, ఖద్దరులాల్చీ, ఖద్దరు పంచ కండువా నలుపూ తెలుపూ గిలిగింతలాడే కత్తిరింపు మీసాలూ. పల్చటి క్రాపు. అలసిపోయిన మొహంతో ఎంతో శ్రద్ధగా శివయ్యకేసి చూస్తూ కూర్చున్నాడు. శివయ్య మాటల ధోరణిబట్టి ఆయన "పెళ్ళికున్న పిల్ల తండ్రి" అనుకున్నాను.

"ఈయన వెంకటేశ్వర్లుగారోయ్" అని పరిచయం చేసేడు శివయ్య.

వెంకటేశ్వర్లుగారు నీరసంగా ఓ చిరునవ్వు నవ్వేరు.

రెండో ఆయన, వెంకటేశ్వర్లుగారి బావమరిది సింహాచలంగారు. లావుగా నల్లగా పొడుగ్గా ఉన్నాడు. వంకర పాపిడి, బొద్దు క్రాపు దాన్లోంచి చెవులమీదికీ నుదురుమీదికీ దిగజారే నూనె నిగనిగా. మోచేతులు దాటిన పొట్టిచేతుల ఖాకీ చొక్కా, ట్రాలిన్ మీసాలూ, బరువు కళ్ళూ—ఆయన లేచి నమస్కారంచేసి నన్నుకూడా కూర్చోమన్నాడు.

ఇంతలో శివయ్య 'గులాబ్ జాం, మసాలా దోసె' అంటూ ఏవో ఆర్డరిచ్చాడు. నాకు కాఫీ చాలన్నాను.

"ఇతను రామారావని, ఇతని తండ్రి శ్రీనివాసరావుగారిని బహుశా మీరు ఎరిగే ఉండొచ్చు, డిప్టీ కలెక్టరు చేసి రిటైరైనారు. ఆయనా నేనూ సహపాఠీలం. నా సలహా లేందే ఆయన ఒక్క పనైనా చేసేవాడు కాదు" నాకేసి ప్రేమగా చూస్తూ "ఇతణ్ణి నా చేతుల మీదుగా పెంచేను." అంటూ వాళ్ళిద్దరికీ నన్ను పరిచయం చేసేడు శివయ్య. అసలు శివయ్యని నేను మొట్ట మొదటిసారిగా చూసింది నాలుగు నెలల క్రిందట. అదేనా యీ కాఫీ హోటల్లోనే అతనికీ నాకూ స్నేహం కలిసింది. మిక్చర్ అణా అని శివయ్య, అణన్నర అని శంకరయ్య, 'నేను అణా అనుకునే తిన్నాను అణా కంటే ఒక్క పైసా ఎక్కువివ్వను' అని శివయ్య తగవులాడుతూంటే ఆ తేడా నేనే చెల్లించాను. ఇంక మా నాన్నగారికి చైనా భాష ఎంత తెలుసో శివయ్య అంటే అంతే తెలుసు. కాని శివయ్య ప్రేమను కాదనలేక పోయాను.

"ఓహో శ్రీనివాస రావుగారి అబ్బాయి గారా. ఆయన పేరు ప్రఖ్యాతులు ఈ జిల్లా అంతా వినికిడే సుమండీ" అన్నారు వెంకటేశ్వర్లు గారు.

సింహాచలంగారు నెమ్మదిగా కనుబొమ్మ లెత్తి నాకేసి చూసి మళ్ళీ కాఫీ త్రాగే ప్రయత్నంలో పడ్డారు.

"ఇంతకీ ఆ అబ్బాయి మనకేమైనా అందుబాటులో ఉంటాడంటారా?" అని అదుర్దాగా ప్రశ్నించేరు వెంకటేశ్వర్లుగారు.

నేను లేవబోయాను.

"అబ్బే కూర్చోండి. రహస్యాలేం లేవు" అని సెలవిచ్చారు సింహాచలంగారు కాఫీ సాసరులోంచి.

ఈలోపుగా శివయ్య గులాబ్ జాం ప్లేటుతో కుస్తీపడ్తూ ఉపక్రమించేడు.

"దానికేం లెండి. ఎనిమిదివేలదాకా యిస్తామంటూ సంబంధాలొస్తున్నాయి అంటున్నాడు పిల్లాడి తండ్రి"

గులాబ్ జాం ముక్క చంచాలోకి తీసుకోలేక ఎడంచేతి చూపుడు వేలితో దాన్ని చంచాలోకి తోసి, ఆ చంచాతో నోట్లో వేసుకున్నాడు శివయ్య. ఆ ముక్క చంచాలో పడేవరకూ దాంతోపాటు సింహాచలంగారి శిరస్సుకూడా యిటూ అటూ తిరిగి తన సానుభూతిని ప్రకటించింది

"ఏయ్ అబ్బాయ్ ఈ ప్లేట్లన్నీ తీసెయ్" కమాండరు హోదాలో పిలచేడు శివయ్య తను ఖాళీచేసిన అరడజను ప్లేట్లకేసి చూపిస్తూ.

శివయ్య నిత్య టిఫిను—ఒక్కడూ ఉన్నప్పుడు—మిక్చరూ కాఫీ, లేకపోతే ఒక్క యిడ్లీ నాల్గు ప్లేట్ల చట్నీ. ప్రస్తుతం పండుగ ధోరణిలో ఉన్నాడు శివయ్య వెంకటేశ్వర్లుగారి ధర్మమా అంటూ

"అబ్బో అంతదాకా తూగలేం" అంటూ సందేహాన్ని వెలిబుచ్చారు సింహాచలంగారు ఖాళీ ప్లేట్లకేసి కసిగా చూస్తూనే.

శివయ్య తన కాఫీలో యింకొస్త డికాక్షనూ, ఇంకో నాల్గుచంచాల పంచదారా వేసుకుని కొస్తకొస్త చప్పరిస్తూ తల పైకెత్తి సింహాచలంగారి సందేహాన్ని పటాపంచలు చేసేడు

"కట్నం మాట అట్లా ఉంచండి సార్. ప్రతీవాళ్ళూ మొదట్లో ఆరువేలు ఎనిమిదివేలని నెత్తికెళ్తారులెండి. కొస్త మాటలు నలిగేక వాళ్ళే దారికి వస్తారు" అన్నాడు వ్యవహార రీతితో

వెం: "మీ రేమంటారు రామారావు గారూ?"

నేను: "నాకు శివయ్యగారి కున్నంత అనుభవం లేదు కాని—ఆయన అనుకున్నంత సులువుగా కట్నాల రేట్లు దిగుతాయని తోచదు. మానవుల్లో స్వార్థం పెరిగిపోతోంది. దాంతో పాటు డబ్బంటే దురాశ హెచ్చయిపోతోంది. ఎన్ని వేలొస్తే అన్నీ రాబట్టాలని ఆశ. "ఫలానా వాళ్ళు ఇన్ని వేలిస్తామన్నారు ఫలానావాళ్లు ఇన్ని వేలిస్తామని వచ్చారు" అని ఎవరూ రాకపోయినా సరే పిల్ల తండ్రిదగ్గర బేరం పెట్టడం అతగాడ్ని త్రిప్పిత్రిప్పి ఆఖరికి ఎక్కువ కట్నం లాగటం—అంతా ఓ మార్కెటు బేరంలా పరిణమించింది."

వెం: "ఉన్నమాట సెలవిచ్చారు రామారావుగారూ. మూడేళ్ళనుంచీ తెగ తిరుగుతున్నాను మా పిల్లకి ఏదేనా సంబంధం కుదురుతుందేమో అని. పిల్ల కప్పుడే పద్దెనిమిదేళ్లు దాటేయి. దాన్నలా ఒంటరిగా పడేసి మేం మాత్రం ఏం సుఖిస్తాం చెప్పండీ. ఎక్కడికి వెళ్ళినా డబ్బు కట్నం ఎన్ని వేలిస్తారన్న ప్రశ్నే. ఇంటికి ఒకటేపోరు ఏదో సంబంధం కుదిర్చెయ్యమని."

"పోనీ పిల్ల అందాన్నీ, చదువు సంగీతాల్నీ చూసేనా కట్నం విషయంలో కొంత తగ్గుతారేమో అని చూసేం. లాభం లేకపోయింది" అన్నారు సింహాచలంగారు నిస్పృహగా.

"పిల్ల అందచందాలు ఎవరిక్కావాలండీ మీ పిచ్చిగాని. మొట్టమొదట డబ్బు. ఆపైన పిల్ల అందచందాలు ఇంతకీ అబ్బాయి ప్రమేయమేమేనా వుంటేగా యీ కుదర్చడాల్లో" అన్నాను.

"పోనీ, మీరెన్ని వేలు ఇవ్వగలరో చెప్పండి. అక్లాను మనుష్యుల్లోనే చూస్తాను" అంటూ ఓ లిస్టు బయటికి తీసేడు శివయ్య. సింహాచలంగారి బలమైన రెండు చేతులూ ఆ లిస్టు నందుకున్నాయి. వెంకటేశ్వర్లుగారూ నేనూ కూడా కుతూహలంతో ఆ లిస్టు చూడ్డం ప్రారంభించేం.

లిస్టు మొదటి పేజీలో ఇంటిపేర్లూ, వాటి కెదురుగుండా గోత్రాల పేర్లూ ఉన్నాయి. తర్వాత ప్రతీ పెళ్ళికొడుకు పేరూ, తండ్రి పేరూ, చదువూ ఉద్యోగం వివరాలూ అన్నీ విపులంగా వ్రాయబడి వున్నాయి.

మేము లిస్టు తిరగేస్తుంటే శివయ్య నెమ్మదిగా తంబాకు సంచీ తీసేడు. వక్కను ఆడకత్తెరతో కత్తిరించి, రెండు ముక్కలు నోట్లో వేసుకుని తమలపాకులకి సున్నం పట్టిస్తూ మొదలెట్టేడు—

"చూడండి, మొన్ననే చావలివారమ్మాయికి ఇట్టే కుదిర్చేను సంబంధం. శివానందంగారబ్బాయి ఉన్నాడే చిదంబరేశ్వర్రావు, అతనికిచ్చి పెళ్ళిచేసేరు. ఆ పెళ్ళి చేయించే యిలా వస్తూంట" అంటూ ఒక్కొక్క ఆకునే నోటిలోపలికి పోనిచ్చాడు.

"శివానందంగారు మీకు బాగా తెలుసుననుకుంటాను" అన్నాను.

"ఆఁ. రాజమండ్రిలో మా యింటి ప్రక్కేగా ఆయన యిల్లూనూ. రోజుకి అథమం ఒక్కసారేనా నేను కనిపిస్తేగాని ఆయనకి తోచేదికాదు. ఒకవేళ నేను పనివల్ల వెళ్ళలేకపోతే ప్రత్యేకంగా కబురు పెట్టించేవాడు. సాయంత్రం గోదావరి ఒడ్డుకి షికారుగా వెళ్తే ప్రక్కన నేనుండాల్సిందే" సున్నం యెడమ అరచేతికి రాసుకుని, పుగాకు ముక్కలు క్రింద తుంపి అరచేతిలో పెట్టి కుడిచేతి బొటనవ్రేలితో పుగాకు ముక్కల్ని నలుపుతూ "ఆయన చాలా స్థితిపరుడు సుమండీ. భూములవల్ల సాలీనా పది పన్నెండువేలదాకా వస్తాయి. అదీగాక యాభైవేలు రొక్కం వుంది" అంటూ అరచేతిలోని పుగాకును కుడిచేతితో చప్పట్లు కొట్టినట్లు కొట్టి నోట్లో వేసుకున్నాడు శివయ్య.

"అయితే ఆయన ఏమాత్రం కట్నం పుచ్చుకున్నారేమిటి?" అని జడుస్తూ అడిగేరు సింహాచలంగారు.

"ఎంతో నా, పదివేలు. వెండి మరచెంబు, కంచం, పట్టుతాపితాలు, వియ్యపురాలి లాంఛనాలు అవిగాక"—అన్నాడు శివయ్య.

"అందరూ ఈ పద్ధతిలో వుంటే ఇక ఆడపిల్లల్ని కన్న సామాన్య సంసారి పని మట్టమే" అన్నారు సింహాచలం.

"అయితే అంత డబ్బున్నవాళ్ళే ఇంకా పదివేలు పాతికవేలని పుచ్చుకుంటున్నారు గదా, ఏం చేసుకుంటారండీ ఈ డబ్బంతా? ఇంకా లేనివాడడిగితే కొంత సబబేనా వుంది" అన్నాడు వెంకటేశ్వర్లుగారు కొద్దిగా కోపంగా.

"ఆ సంగతి వాళ్ళనడిగితేనే ఉత్తమం" అన్నాడు శివయ్య వెకిలిగా నవ్వుతూ.

"ఉన్నవాళ్ళకే యింకా అన్నివేలు పొయ్యటంకంటే ఏ లేనివాడికో పిల్లనిచ్చి పెళ్లిచేసి ఆ యిచ్చే పదివేలూ వాడికే యిచ్చి వ్యాపారం పెట్టిస్తే అందరూ సుఖపడతారు. పిల్లాడూ మనయందు కృతజ్ఞతతో ఉంటాడు నెత్తి నెక్కకుండాను" అన్నాను నేను.

"ఆమాటకేం గాని, శివయ్యగారూ మీకు పుణ్యముంటుంది మా అమ్మాయి కేదేనా సంబంధం చూసి పెడ్దురూ. మీ మేలు మరచిపోం." అని ప్రాధేయపడ్డారు వెంకటేశ్వర్లుగారు. తంబాకు నములుతూ జాలి మొహం పెట్టి శివయ్య తాపీగా అన్నాడు.

"అదే నేనూ చూస్తున్నానండీ! పోనీ వీరరాఘవులుగా రబ్బాయిని చూసేరా? ఇంటరు రెండోఏడు చదువుతున్నాడు ఆరునెలల్లో కుదరొచ్చు."

"ఇంటరా" అని చప్పరించేరు సింహాచలంగారు.

"ఇంతకీ వాడు సరిగ్గా ప్యాసవుతాడని నమ్మకమేమిటి? పైగా తర్వాత చదువంతా మేమే చెప్పించాల్సి వుంటుందేమో" అని సంకోచాన్ని వెలిబుచ్చేరు వెంకటేశ్వర్లుగారు.

"కాని" అని ఆగేడు శివయ్య ఏదో మహా విశేషం చెప్పబోతున్నట్లు. మేమంతా ఆదుర్దాగా ఏం చెప్తాడో అని ఉగ్గబెట్టుకు చూస్తున్నాం. వెంకటేశ్వర్లుగారి మొహంలో ఆశారేఖ పొడగట్టింది. శివయ్య నెమ్మదిగా లేచి, చేతులు కడుక్కునే బేసిన్‌లో కాండ్రించి ఉమ్మేసి తిరిగివచ్చి కూర్చున్నాడు.

"ఆయన కూతురికి పెళ్ళయితే గాని కొడుక్కి చేయడట" అన్నాడు గబుక్కున.

"పిల్ల కెన్నేళ్ళు?" అన్నారు సింహాచలంగారు.

"పదహారేళ్ళుంటాయి" అన్నాడు శివయ్య.

"అమ్మాయికి ఏమాత్రం కట్నం యిస్తాడేమిటి?" అన్నాను.

"అమాంబాపతులు లాంఛనాలూ కట్నం అన్నీ కలిపి రెండువేలు యివ్వచ్చు మహా అయితే మూడువేలు. మూడువేలు దాటదు" అన్నాడు శివయ్య.

"అబ్బా! ఏం ఆశ. కూతురికయితే రెండువేలు యిస్తాడూ! తన కొడుక్కి మట్టుకి ఆరువేలు కావాలా" అని ఫిర్యాదు చేసేరు సింహాచలంగారు.

ఆడపిల్ల తండ్రి అన్నవాడు జేజేలు పట్టాలిసిన మనిషిలా కనిపించేడు సింహాచలంగారు.

"ఇంతకీ పిల్లకయితే నేగాని పిల్లాడికి చెయ్యనడమేమిటండీ. అంతవరకూ పిల్లాడు లొట్టలేసుకుంటూ కూర్చోవలిసిందేనా?" అన్నాను.

"బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా పనికిరాదండోయ్" అని హెచ్చరించేరు సింహాచలంగారు.

"పోనీ పెద్ద సంబంధాలల్లా వుంచి ఇంకేవేనా చెప్పుదురూ" అని అడిగేరు వెంకటేశ్వర్లుగారు.

ఇన్ఫర్మేషన్ అంతా యిప్పుడే యిచ్చేస్తే మళ్ళా టిఫిన్ ఛాన్సు దొరకదేమో అన్నట్లు చూసేడు శివయ్య. కొంచెపాలోచించి "అనకాపల్లిలో వీరేశ్వరరావుగారున్నారు. వారి అబ్బాయి స్కూలుఫైనలు రెండోసంవత్సరం మొన్ననే పరీక్షకి వెళ్ళేడు," సింహాచలంకేసి చూస్తూ "యీసారి తప్పకుండా ప్యాసవుతాడులెండి," "కుర్రాడు మన్మధుడులా వుంటాడు. నిక్షేపంలాంటి సంబంధం. మంచి సంప్రదాయమైన కుటుంబం పిల్ల సుఖపడుతుంది" అన్నాడు శివయ్య.

"ఆఁ పిల్లాడు మన్మధుడూ పిల్ల రతీదేవీని. పెళ్ళి అయ్యేవరకూ అందరు పెద్దలూ యిలాగే కబుర్లు చెప్తారు. తీరా వాళ్ల అసలు రూపులు చూస్తే కడుపు నిండిపోతుంది" అన్నారు వెటకారంగా సింహాచలంగారు.

ఆయినమట్టుకి అందరి కడుపులూ నిండిపోయేటట్లు ఉన్న సంగతి ఆయనకి తెలియక పోవటంచూసి చాలా జాలివేసింది.

శివయ్య చురచుర చూసేడు ఆయనకేసి. వాళ్ళిద్దరిమధ్యా కొరియాయుద్ధంలాటి ప్రచండ వాగ్ధుమారం బయలుదేరుతుందేమో అని భయపడ్డాను. శివయ్య సీరియస్‌నెస్‌కీ సింహాచలం చణుకులకీ మొదటినుంచీ అంగరందకుండానే ఉన్నది.

ఇంతకీ పిల్లాడి తండ్రి ఏంచేస్తూన్నట్లు?" అన్న వెంకటేశ్వర్లుగారి ప్రశ్న యాటంబాంబయి పూరుకుంది.

"ఆయన షావుకారు గుమాస్తా."

"ఓహో!" అంటూ శివయ్యకేసి చూడడం మానేసి హోటల్ పెరట్లోని పిండి రుబ్బుతున్న వాడికేసి చూడటం ప్రారంభించేరు సింహాచలంగారు.

"అయితేనేం బాగానే సంపాదిస్తున్నాడు" అన్నాడు ఊరుకోక శివయ్య గట్టిగా సింహాచలానికి వినబడాలని. "కట్నం ఏమాత్రంలో వున్నాడు స్వామీ" అన్నాను.

శివయ్య, "ఎంతో నా మూడు వేలు."

"పూటకు టికాణా లేనివాడికి మూడు వేలు కావాలిట చెప్పొచ్చారు పైగాను" అంటూ సింహాచలంలేచి ఉమ్మేసుకుందుకు అన్నట్లు అవతలకి వెళ్ళాడు శివయ్యకేసి చూడకుండా.

శివయ్య చూపులు సింహాచలంగార్ని కొంత వరకూ వెంబడించి దారిలో మిగతా పెద్ద మనుష్యులు అడ్డురావటంవల్ల చిందరవందరై హోటల్ మేనేజరు శంకరయ్య తలమీదుగా తిరిగి తన తంబాకు పైకి ప్రసరించేయి.

మళ్ళా తమలపాకులు బయటికి తీసేడు శివయ్య.

"మరి కొండేపూడివారి సంబంధం కుదురుతుందంటారా?" అని మళ్ళా ధైర్యం తెచ్చుకుని రెట్టించారు వెంకటేశ్వర్లుగారు తనుఇచ్చిన టిఫిన్‌కి తగిన ప్రతిఫలం పొందాలనే ఆశతో అన్నట్లు.

"ఆ, అదెంతసేపు. కొండేపూడి సూరన్న నా బాల్యస్నేహితుడు."

"అయితే ఎప్పుడు వెళ్దామంటారు ఆయన దగ్గరకి" అన్నారు సింహాచలంగారు రాజీ ధోరణిలో, కుర్చీలో కూర్చుంటూ.

శివయ్య పిండి రుబ్బుతున్న వాడికేసి చూస్తూ, వెంకటేశ్వర్లుగారి నుద్దేశించి యిలా అన్నాడు:

"మొన్ననే మద్రాసులో డిప్టీకలెక్టర్ దినేస్వర్రావుగారి అమ్మాయికి ముక్కామలవారి సంబంధం కుదిర్చేను. పెళ్ళంతా నా చేతులమీదుగా జరగాలని ఆయన మరీ పట్టుబట్టాడు. ఆయనచేత అన్నిసార్లు అనిపించుకోడం ఇష్టం లేక "ఓ అల్లాగే తప్పకుండా వస్తానని" ఒట్టు వేసి మరీవచ్చాను. అంచేత రేపు నేను మద్రాసు వెళ్ళాల్సి వుంటుంది."

దినేశ్వర్రావు అనే మనిషి అసలు ఉన్నాడో లేదో అనే విషయంగాని, ఆయనగారి మిగతా భోగట్టాగాని అడగాలని అనిపించినా, సింహాచలంగారినిచూసి భయపడి శివయ్యని అడగటం మానేసేను.

వెం: "అయితే మీరు తిరిగి యిక్కడికి ఎప్పుడొస్తారు?"

శివయ్య తన దృష్టిని బిల్లురాసే అయ్యరుకేసి త్రిప్పి "వచ్చేటప్పుడు హైదరాబాదులో సబ్‌జడ్జీ సచ్చిదానందంగార్ని ఒక్కసారి కలుసుకుని, బరంపురం వరకూ వెళ్ళివద్దామనుకుంటున్నాను" అంటూ అయ్యరును తప్పించుకుని శంకరయ్యవైపు నడిచేడు. సీట్లు ఖాళీలు లేక మా వెనకనే కొందరు పెద్దమనుష్యులు నిల్చిఉండటం గమనించి మేంకూడా లేచాం.

"అసలు ఈ పెళ్ళికొడుకులకేనా బుద్ధి ఉండొద్దుటయ్యా. తండ్రి దురాశతో అడిగితే మట్టుకు తన చదువూ, సంప్రదాయం, తన వ్యక్తిత్వం ఏమైనట్లు? అన్ని విధాలా తనకు నచ్చిన పిల్లగల సంబంధం వస్తే, "నాన్నా నేనా పిల్లను తప్ప ఇంకోళ్లను చేసుకోను. నాకు కట్నంతో నిమిత్తంలేదు. ఏమైనా నే నాపిల్లనే చేసుకుంటాను" అనే మొగాడేడండీ ఈ ప్రపంచంలో! ఉట్టి ప్లాటుఫారం కబుర్లూ, పుస్తకాల చర్చలూ చేసేవాళ్లు తప్ప!" అని ధీమాగా ప్రశ్నించారు సింహాచలంగారు బిల్లు చెల్లిస్తూ. శివయ్య చూపులు బిల్లునుమానీ చల్లగిల్లాయి.

---

ఒక రాజకీయవేత్తని ప్రత్యర్థి ఒకడు "నువ్వు కమ్యూనిస్టువి!" అన్నాడు. మొదటి వ్యక్తి కోపంతో, "ఎలా రుజువు చేస్తావ్?" అంటే ప్రత్యర్థి "రుజువు చెయ్యలేను. కాని నేను ఒక పక్షిని చూశాననుకో. అది బాతులాగ నడిచి, బాతులాగ అరిచి, బాతులాగ యీది, బాతురెక్కలు విరిచి ఎగురుతూ బాతులతో కలిసి ఉంటూంటే, అది బాతు కాదని ఎలా అనుకోను?" అన్నాడు.